

# స్వీట్ సిక్స్టీన్

'స్వీట్ సిక్స్టీన్' అంటారు నిజమే! ఆ వయసులో మగపిల్లలకంటే ఆడపిల్లలే ఎక్కువ కలలు కంటారు చిన్న అనుభవమే ఆ సున్నితంగా ఉండే మనసును ఆనందంతో ఉర్రూతలు ఊగించవచ్చు. లేక లోతుగా గాయం కూడా చెయ్యవచ్చు. నా జీవితంలోనూ అలాంటిదే ఒక సంఘటన, ఈనాటికీ, ఏనాటికీ మరపు రానిది జరిగింది!

ఇప్పుడు నా వయసు నలభై సంవత్సరాలు వివాహం అయింది. ఇద్దరు రత్నాల లాంటి బిడ్డలు, ఆదరించి ప్రేమించే భర్త. అయినా ఒంటరిగా ఉన్నప్పుడు అనుకోకుండా పదహారు ఏళ్ళ వయసులో కన్న

## రాధాకుమారి

కలలు కల్లగా మారిన రోజు - ఆ రోజు నేను అనుభవించిన బాధ, ఆతర్వాత ఎన్నో రోజులు నా మనసుకు చుట్టి పొగమంచులా వాస్తవాన్ని చూడనివ్వకుండా చేసిన ఆ అనుభవం ఈనాటు తల్చుకుంటే నవ్వొస్తోంది. అదో మధురమైన మిగిలిపోయిన అనుభూతిలా ఆనందం కూడా కలుగుతూ ఉండేది.

అప్పుడు నాకు పదహారేళ్ళు. పదో క్లాసు చదువుతున్నాను మా ఇంట్లో నేను అందరకంటేచిన్నపిల్లను. నలుగురు అన్నయ్యలు అందరూ నన్ను అపురూపంగా చూసుకొనే వారు.


మా పెద్దన్నయ్య బ్యాంకులో పని చేస్తున్నాడు. నేను అందంగా ఉంటాను అనేవారు, పగటి కలలు కనేదాన్ని అదే సమయంలో ఒకసారి మా అన్నయ్య స్నేహితుడు మా యింటికి వచ్చాడు. అతనుకూడా అన్నయ్య చేసే బ్యాంకులోనే పని చేస్తున్నాడు. తెల్లగా పొడుగ్గా ఉన్నాడు. నేను తలుపు చాటు నుంచి చూసాను. నా గుండె దడదడ లాడింది. నా కలల్లో రాజకుమారుడు ఇతనే అనిపించింది.

అమ్మచేతిలోని మజ్జిగ గ్లాసులు అందుకొని (అది వేసవికాలం-అతను కాఫీ వగైరా తాగడట) నేను వాళ్ళముందుకెళ్ళి గ్లాసులు టేబుల్ మీద పెట్టాను.

"నువ్వెందుకమ్మా తెచ్చావ్? అమ్మ ఏం చేస్తోంది?" అన్నాడు అన్నయ్య. అన్నయ్య మాటలోనే నాకు అలా నేను రావడం ఇష్టంలేదని అర్థం అయింది పలక్కుండా వెనక్కి వెళ్ళిపోతున్న నాకు "మా చెల్లాయి, రాధ!" అని అన్నయ్య అనడం విన్పించింది.

నేను వెనక్కి చూశాను. అతను నాకేసి చూశాడు. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. క్షణంసేపు సృష్టంతా నిలబడిపోయినట్టు అన్పించింది — లోపలకు వెళ్ళిపోయాను. తలుపుదగ్గిర పుస్తకం చేతిలోపట్టుకొని

కవితకి కార్టూన్ :





ఆమె కన్నులలో ననంతాంబరపు
నీలి నీడలు కలవు

-కృష్ణశాస్త్రి

వాళ్ళమాటలు వింటూ కూర్చున్నాను. అతని కంఠం నాకు కోటివీణలు ఒకసారి మ్రోగుతున్నట్టూ, ఆ శబ్దంలో నేను కరిగి పోతున్నట్టూ అన్పించింది, అతను వెళ్ళి పోయాడు, వెళుతూ, వెళుతూ నాకోసం అతని కళ్ళు వెదికే ఉంటాయని ఊహించుకున్నాను. సినీమాలూ, నవలలూ చూసేదాన్ని — చదివేదాన్ని—నాకిష్టమైన హీరోలందర్నీ అతని రూపంలో ఊహించుకుంటూ కలలు కనసాగాను.

అతను అప్పుడప్పుడు మా ఇంటికి వస్తూ ఉండేవాడు. అతను అన్నయ్యకోసంకాదనీ, నేను కన్పిస్తానేమో ననే ఆశతోనే వస్తున్నాడనీ ఊహించుకునేదాన్ని. ఒకరోజు అన్నయ్య వచ్చి "శ్రీధర్ (అతనిపేరు) నిన్ను ప్రేమిస్తున్నాడు చెల్లాయ్ నిన్ను పెళ్ళిచేసుకుంటాడట - నీకు ఇష్టమేనా ?"

కవితకి బొమ్మ




కాగితం పొలంలో
కలం హాలమేసి దున్నితే మొలకెత్తేది
అక్షరాల పంట

-దేవిప్రియ

అని అడుగుతాడని ఊహించసాగాను. అన్నయ్య దేనికి పిలిచినా అందుకేనని ఎదురు చూసేనాకు నిరాశే ఎదురయ్యేది. స్కూలుకు వెళ్ళేదాన్ని. కాని ఇంటికి వచ్చిన మగవాళ్ళకలా కనపడటం మావాళ్ళకు ఇష్టం ఉండేది కాదు. శాస్త్రపరదా పాటించే కుటుంబం!

రాత్రిళ్ళు నిద్రపోయేదాన్ని కాదు. నేను చిక్కిపోతున్నానని డాక్టర్లకు చూపించే వాళ్ళు. ఆరోజు అన్నయ్య ఊళ్ళోలేడు, ఎవరో తలుపుకొడితే తలుపు తెరిచాను, అలాగే నిలబడిపోయాను. ఎదురుగా శ్రీధర్.

అతను చూస్తూ నిల్చున్నాడు.

"రండి లోపలకు" గొంతులో వణుకు.

"మోహన్ లేడా?"

"ఊరికి వెళ్ళాడు."

అంతలో అమ్మవచ్చి అతన్ని ఆహ్వానించింది. "వెళ్ళొస్తానమ్మా! మోహన్‌తో పనిఉండి వచ్చాను" అంటూ అతను వెళ్ళిపోయాడు.

నేను నాగదిలోకి వెళ్ళి కళ్ళు మూసుకొని పడుకున్నాను. అతను నన్ను పరిశీలనగా చూడటం మళ్ళీ మళ్ళీ ఊహించుకోసాగాను, అవును! అతను నన్ను ప్రేమిస్తున్నాడు. ఇవ్వాళ నా పెళ్ళి గురించి అడగటానికే వచ్చి ఉంటాడు అనుకున్నాను.

ఆరునెలలు గడిచాయి, అతను వస్తూనే ఉన్నాడు. నాకళ్ళు అతనికోసం వెదుకుతూనే ఉన్నాయ్. నేను తలుపుచాటునుంచి అన్నయ్య చూడకుండా తొంగి చూసేదాన్ని. అతను ఆసంగతి పసికట్టి అప్పుడప్పుడు వాకిలికేసి చూసి చిరునవ్వు నవ్వేవాడు.

ఒకరోజు స్కూలునుంచి వస్తున్నాను. అతను అప్పుడే స్కూటర్ ఆపి దిగాడు. నాకాళ్ళు తడబడ్డాయి. వీధివాకిట్లోనే నిలబడి పోయాను.

"స్కూల్‌నుంచి వస్తున్నావా?" చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించాడు.

నేను సిగ్గుతో మెలికలు తిరిగిపోయాను, ఏదోగా అనిపించింది.

"ఎందుకమ్మా అంతసిగ్గు! నేనూ నీ అన్నయ్యలాంటి వాణ్ణే!" అన్నాడు.

ఒక్కసారిగా కాళ్ళకింద భూమి జరిగింది. కళ్ళముందున్న ప్రతి వస్తువు గిర్రున తిరిగింది, పడబోతూ గడప పట్టుకొని తమాయించుకున్నాను. పరుగు లాంటి నడకతో ఇంట్లోకి వెళ్ళాను. నాగదిలోకి వెళ్ళి తలుపులు బిగించుకున్నాను, భోరుమని ఏడ్చాను.

మోసపోయిన హీరోయిన్‌లా కొంత కాలం బెంగతో కుమిలి పోయాను.

ఏమనుకున్నాడో, ఆతర్వాత శ్రీధర్ మళ్ళీ మా ఇంటికి రాలేదు.

మరో ఆరునెలలకు నాకు పెళ్ళి కుదిరింది. చేసుకోనని చెప్పే ధైర్యంలేదు. మొదటి రాత్రి నామనసు ఇంతకుముందే వేరే వ్యక్తికి అంకితం అయింది అని చెప్పాలనుకున్నాను, చెప్పేధైర్యం లేకపోయింది.

ఇప్పుడు ఆలోచిస్తుంటే భయం వేస్తుంది? నిజంగా, ఫూలిష్‌గా అలా చెప్పి ఉంటే ఏమయ్యేదో?!